
అది రాజధానిలో ఒక అతిముఖ్యవ్యక్తి నివసిస్తున్న బంగళా. బంగళాకు కాపువుండే వ్యక్తికి మధ్యాహ్నం మరొక డ్యూటీకూడా వుండేది. అది పాలడిపోనుంచి పాలసీసాలు తీసుకురావడం. ఆ ఒక గంటసేపూ బంగళాలోకి ఎవరూ చొరబడకుండా కాపాడే బాధ్యత పెంపుడు కుక్క టామీపై పడేది.

నిజానికి పాలు తేవడం ఒక అర్ధగంట పనేకాని, కాపువుండే మనిషి ఆ పనిని పూర్తిగా ఒక గంటకు పెంచి అదనపు సమయాన్ని తోటివారితో బాతాఖానీకీ, తన యజమాని, యజమానురాలు తనకు, ఇతర నౌఖర్లకు చేస్తున్న అన్యాయాలను ఏకరవుపెటడానికీ వినియోగించేవాడు.



# వి.ఐ.పి బంగళాలో ఆవువేట

పులిగడ్డ విశ్వనాథరావు

టామీ ఈ మధ్యన జబ్బుపడి కుక్కల ఆస్పత్రిలో చేరడం వల్ల ఆ గంటసేపూ బంగళా బైట ఏ కాపూ వుండేది కాదు. ఒక రోజు అటువంటి సమయంలో ఒక తెల్లటి కామధేనువు లాంటి ఆవు అలా గడ్డి మేస్తూ బిగ్ బాస్ పచార్లుచేస్తూ అనుకోకుండా ఒక సెక్షన్‌లో దూరినట్టు ఆ బంగళాలోకి చొరబడింది.

ఆ ఆవు అన్‌ఎడ్యుకేటెడ్ బ్రూట్ కాబట్టి దానికి నేమ్ ప్లేట్లు చదివే అలవాటు లేదు. దానికి సరస్వతీ కటాక్షంగానివుండి వుంటే బంగళా గేటుకున్న నేమ్ ప్లేటును చూసి మంత్రిమండలిలో స్థానం దొరికే అవకాశం వుందని తెలుసుకున్న రాజకీయవేత్త స్వంత పార్టీని ఎంత వేగంగా వదిలి అధికారంలోకి రాబోతున్న పార్టీలో చేరుతాడో అంత వేగంతోనూ ఆ ఆవు వెనక్కు

---

*ఆవులకోసం యుద్ధాలు, హత్యలు జరిగినట్టు మన పురాణాలు చాటుతున్నాయి. ఈ కలియుగంలోకూడా ఆవు ఎటువంటి ఇక్కట్లు కలిగించగలదో ఆలోచించారా?*

# మల్లెపందిరి

## దత్తపది

**వ**హాలిక ఇబ్రహీం (మల్కిభరామ్) వంటి ప్రభువొకడు కవి బాలకులను కొందరిని చేరదీసి, నాలుగు గురువులుగల పాణిని సూత్రాలను నాలు గింటిని చదివి సార్థకంగా పాదపూర్తి చేయమని 'దత్తపది' ఇచ్చాడు.



'సర్వస్య ద్వే' సుమతి కుమతీ
సంపదాపత్తి హేతూ
'ఏకో గోత్రే' ప్రభవతి పుమాన్
యః కుటుంబం బిభర్తి।
'వృద్ధో యూనా' సహ పరిచయాత్
త్యజ్యతే కామినీభిః
'స్త్రీపుంవచ్చ' ప్రభవతి యదా తద్ధి
గేహం వినష్టమ్॥

'సర్వస్య ద్వే' ప్రతివానికీ రెండు- మంచి బుద్ధీ చెడు బుద్ధీ సంపదకూ ఆపదకూ హేతువులుగా వున్నాయి.

'ఏకో గోత్రే' వంశంలో ఒక(డు) మగవాడు కుటుంబ భారం మోయ గలవాడు.

'వృద్ధో యూనా' ముసలివాడు పడుచువాడితో సహవాసం చేస్తే కామినులచే విడవబడతాడు.

'స్త్రీ పుంవచ్చ' స్త్రీ పురుషునిలా అధికారం చెలాయించే ఇల్లు వినష్టమై పోతుంది.

ఆ దత్తపదిని పైవిధంగా వారు పూరించారన్నమాట.

—సౌభరి

పరుగుదీసును. వి. ఐ. పి. ఇంట్లో ప్రవేశించడానికి ఎన్ని గుండెలుండాలి!

ఆవు బంగళాలో ప్రవేశించి లానులో ముచ్చటగొల్పే గడ్డిని చూసి పంచదార కోసం ప్రాకులాడే గృహస్థుకు చక్కెర బోక కనిపించినంత సంబరపడి 'ఆవురావురు'మనితిండానికిఉపక్రమించింది. ఇంతటిలో ఈపూట కూర ఎక్కువగా వండడం వల్ల మిగిలిపోయినందుకు వంటావిణ్ని సంబోధించి సహస్రనామ పారాయణచేసి ఆ ఇంటి యజమానురాలు రుసరుసలాడుతూ బైటకు వచ్చింది. అసలు ఆ పాటి కూర మిగలడంవల్లనే పనిమనిషికీ, వంటావిడకీ ఈ పూట కాస్త కూర అందింది. లేకపోతే రోజూలాగ ఈ పూట కూడా వాళ్ళకు పొడి మెతుకులే దక్కను.

"ఇంతకీ ఆకూరపడబొప్పె గుమ్మరించి కొన్నది ఐతేగా. ప్రభుత్వ ఖర్చుతో పెరటిలో పండిందేకదా. దానికోసం ఈ మహా ఇల్లాలు నన్ను అలా ఆడిపోయాలా ?" అని తర్వాత వంటావిడ పనిమనిషితో దీర్ఘాలు తీసిందికూడా.

తెరమీద మాత్రంహీరోయిన్ నిండుగా అజంతా చిత్రంలా కనబడి యధార్థంలో గాలి తీసిన బెలూన్‌లో కనబడినట్టు లానులో గడ్డి చూడడానికి ముచ్చటగా వున్నా నోటికి మాత్రం అంది చావదని గ్రహించి ఆ ఆవు చుట్టూ చూసింది. బంగళాకు ఒక వైపు కూరగాయల పెరడు కనబడింది. చుట్టూ కంచెవుంది కాని లక్ష్యశుద్ధిగలవారిని కొండలూ, సముద్రాలూ కూడ అడ్డుకోవు అని అంటారు. రాజకీయవేత్త మంత్రి మండలిలో సీటు కోసం పార్టీ ఫిరాయించి, నిరాశచెంది జాతి శ్రేయస్సుపేరిట గాంధీ, నెహ్రూగార్ల పేరిట మరల మరొక పార్టీలోకి దాటు వేసినట్టు ఆ ధేనువు కంచెమించి దుమికి కూరల పెరటిలో ప్రవేశించింది. అక్కడ ఇంటి యజమానురాలు ప్రాణపదిలంగా చూసుకునే కూర మొక్కలను కూరగాయలతో సహా ఆరగించసాగింది.... ఈలోగా బైటకు వచ్చిన యజమానురాలు ఆ భీభత్స దృశ్యం చూసి స్మగుల్డ్ సరుకును అనేక కష్టమ్స్ బారినుంచి తప్పించి తెస్తే తీరా పోలీసులు తన్నుకుపోయినట్టు అంత శ్రమపడి పండించిన కూరగాయలను ఆవు అలా కిలీలా నమిలివేయడంసహించ రాదని నిర్ధారించుకుంది. వాకౌట్ చేసే ముందు శాసన సభ్యులు అరిచినట్టు గొంతు చించుకుని అరుస్తూ బంట్రోతు క్వార్టర్లవైపు పరుగుదీసింది. అనగా అంత బరువుగల స్త్రీ యెంతవడిగా నడవగలదో అంత వడిగా ఆమె కదిలిందని అర్థం. వెంటనే భీముడిలాంటి ఒకబంట్రోతు పరుగెత్తుకుంటూ వచ్చాడు. యజమానురాలు వాలకంచూసి, కూరగాయలు ఆరగిస్తున్న ఆవును చూసి పరిస్థితి అర్థం చేసుకుని ఇంట్లోకి వెళ్ళి గదలాంటి దుడ్డుకర్ర చేతపట్టి సాక్షాత్తు హిడింబి మొగుడిలా తయారయి అదిలిస్తూ ఆవు వెంట పడ్డాడు. ఆవు మామూళ్ళకు అలవాటు పడిన ఉద్యోగిలా ఏ బిడియమూ లేకుండా హాయిగా వంకాయలను, బెండకాయలను (సదరు ఉద్యోగికి పది రూపాయల మామూలుకు బదులు నూరు రూపాయల మామూలు లభించినట్టు) ఆరగిస్తోంది.

ఈ ఆవు ఇలా లొంగేదికాదని ఆ అపర భీముడు దానిని వీపుమీద దుడ్డుకర్రతో బాదగా అది పెరటిలో కంచె చుట్టూ పరుగెత్త సాగింది. అత్తారింట విందు భోజనాలు ఆరగించి వి. ఐ. పి. మర్యాదలు అందుకుంటున్న అల్లుడు సెలవయిపోయినా అత్తారిల్లు వదలిపోవడానికి మనసొప్పక చూరుపట్టుకు వేలాడినట్టు ఆవుకు పెరటి కంచె దూకి పారిపోవడానికి మనసొప్పడం లేదు. సదరుఅల్లుడి మామగారు లౌక్యంగా 'ఏమోయ్‌నీకోసంమీఅమ్మ,నాన్న, చెల్లెళ్లు బెంగపెట్టుకుంటారేమో. నువ్వు సెలవు పొడిగిస్తున్నట్టు తెలిపి, వాళ్ళు యేమంటారో కనుక్కోవడానికి ఉత్తరం ముక్కైనా రాశావా?" అని హింట్ చేసినట్టు భీముడు పెరటితలుపు తెరిచాడు. ఆ అల్లుడు "ఈ రోజే రాశానండి మీరన్నట్టు బెంగ పెట్టుకునే వుంటారు. అందుకే వాళ్ళనీ యిక్కడకి వచ్చేయమని రాశాను" అని బదులు చెప్పినట్టు ఆవు

తెరిచివున్న గేటును చూసీ చూడనట్టు ముందుకు సాగిపోయి యథాప్రకారం చుట్టూ తిరగసాగింది.

కొంతమంది ఉద్యోగాలకోసం, లైసెన్సుల కోసం, కంట్రాక్టుల కోసం మామూలు గేటు లోంచి రారు. కంచె దూకైనా వస్తారు, కంచెను విరక్కొట్టైనా వస్తారు. మొత్తంమీద పని ముగించుకుని అలాగే అంతర్ధానమవుతారు. ఆ కోవకు చెందిందే ఈ ఆవు. భీముడి చావుదెబ్బలు భరించలేక ఇహ నిష్క్రమించడమే మేలనుకొని ఆవు ఆ కంచెను విరకొట్టి దారి చేసుకొని బైటకు వచ్చింది. మొత్తం మీద తన సిద్ధాంతానికి అనునయంగా గేటు లోంచి మాత్రం రాలేదు. ఐతే కూరల పెరటిలోంచి బైటకువచ్చిన ఆవు బంగళా ముందుకుపోక వెనక్కు పరిగెత్తి బంగళా వెనుకగల వరండాలోకి ప్రవేశించింది. ఆ వరండా గచ్చు ముసలి హీరో విగు లేని బట్టతలలా నున్నగా, తళతళా మెరుస్తోంది. మరి ఇంటి యజమానురాలు స్వయంగా ముందుండి పనిమనిషిచేత ఇంటి గచ్చునంతా తడి గుడ్డతో క్లీను చేయిస్తుందిగా! ఆవు ఆ గచ్చుమీద జారి పడింది. ఆ పడడం పడడం మరి లేవలేక పోయింది. బంట్రోతు అదిలించాడు, దుడ్డు కర్రతో పొడిచాడు కాని లాభంలేక పోయింది. ఇంతలో ఇంటి యజమానురాలు వచ్చి ఆవును చూసి నెత్తీ నోరూ బాదుకుంటూ, “అయ్యోరాత. ఇది ఇక్కడ ఛస్తే మాకు గోహత్యా పాపం చుట్టుకోవడమే కాకుండా మా ప్రతిష్ఠకూడా మట్టి పాలవుతుంది. ఆవు సొంతదారుకు నష్ట పరిహారంకూడా చెల్లించుకోవాలి” అని విలపించసాగింది. బంట్రోతును, “దాన్ని బైటకు తరమాలి కాని అలా బాది చంపేస్తావా? నీ గొడ్డు బలమంతా పాపం దానిపై చూపెడతావా? ఆరు నెలలు సాము చేసి మూలనున్న ముసలమ్మను పొడిచాడుట నీలాంటి పహిల్వానే” అని కేకేసింది.

వేయి దేముళ్ళకు మొక్కుకుంటూ ఆమె బక్కెటులో నీళ్ళు తెచ్చి ఆవు ముందు వుంచింది. ఊహు. ఉలుకూ పలుకూ లేదు. గడ్డితెచ్చి ఆవు నోటిలో పెట్టింది. కాని అది తింటేగా. “నా బుద్ధి గడ్డి తినాలి కాని యిది తింటుందా” అని విసుక్కుంది యజమానురాలు. ఆవు అలా నిశ్చలంగా బెల్లం కొట్టిన రాయిలా పడుండంచూసి ఏదో గుర్తు వచ్చినట్టు కొంచెంగా బెల్లంతెచ్చిఆవుముందువుంచింది. కాని ఆవు కళ్ళు తేలేసి పడుంది. బెల్లం వాసన కూడా చూడలేదు. యజమానురాలు బెంబేలెత్తిపోయి భర్తకు ఫోను చేసింది.

ఇంతలో ఆవు సొంతదారు దాన్ని వెతుక్కుంటూ బంగళాలో తన ఆవు ఉనికి పసిగట్టి వచ్చిపడ్డాడు. ఆవును చూసి ఆవేశంతో, “నా ఆవును మీ కడుపున పెట్టుకున్నారే. రెండు గడ్డి పరకలు మేసిందని కసాయివాడిలా చావబాదుతారా?” అని బంగళా యజమానురాలును మరింత కంగారు పెట్టేసి తన కుటుంబం వారికి ఈ దుర్వార్త చెప్పి, తర్వాత కార్యక్రమం గురించి ఆలోచిద్దామని బయలుదేరాడు. ఇంతలో బంగళా యజమాని కూడా కారులో ఆదరాబాదరాగా వచ్చిపడ్డాడు. పరిస్థితి తెలుసుకుని మునిసిపల్ కార్పొరేషన్ అధిపతికి ఫోనుచేశాడు. ఆ అధిపతి ఆయన పరిచయస్తుడే. అతడు బంగళా యజమాని చెప్పిన

# రాజకీయ సుప్రభాతాలు (3)

సోమసుందర్




ఇంతకీ ఈ దేశమంటే మరేమిటను
కొన్నారు?

ప్రారంభోత్సవ హంగామాల బారిపడ
కుండానే

కూలిపోయిన డోర్నకల్ రోడ్డు
వంతెన!

ఇంకా ఏమ్మిగిలింది ప్రజల కిందులో
వంతు?



వివరాలన్నీ విని వెంటనే ఏదో ఏర్పాటు చేయిస్తానని మాటఇచ్చాడు. ఆ అధిపతి పశువులను పట్టుకునే శాఖాధికారికి ఫోను చేసి వెంటనే ఆ బంగళాకు ఎవరినైనా పంపి తగు ఏర్పాట్లు చేయమని ఉత్తరువు జారీచేశాడు.

ఆ శాఖాధికారి తన క్రింది అధికారికి చెప్పగా అతడు తన క్రింది అధికారికి ఏర్పాటు చేయమని హుకుం జారీచేశాడు. ఆ అధికారి క్రింది అధికారికి చెప్పగా.... చివరికి ఒక పశువుల ఇన్‌స్పెక్టర్ ఏర్పాట్లు చేయడానిక బయలుదేరాడు. అతడు చేరేసరికి బంగళాముందు ఓ యాభై మంద గుమికూడి వున్నారు. వారు ఆ ఆవు యజమాని, అతడి చుట్టాలు. బెల్లం వాసన పసిగట్టి చేరే చీమల్లాంటి రాజకీయవేత్తలూను. ఆ గుమికూడినవారినిసంబోధిస్తూ ఒకగాంధీటోపీధరించినవ్యక్తి ఉపన్యాసం దంచేస్తున్నాడు. "ఇటువంటి దౌర్జన్యం మనం సహించకూడదు. పదవిలో వున్నామని ఒక పేదవాడి ఆవును ఈ విధంగా హతమారుస్తారా? ఈ దౌర్జన్యాలు దేశమంతా జరుగుతున్నాయి. వాటికి గురైనవాళ్ళు వెల్లువలా లేచి ఈ నరరూప రాక్షసులను ముంచెత్తిననాడే మన దేశం గాంధీజీ వూహించిన రామరాజ్యంగా మారగలదు...." జనం చప్పట్లు చరిచారు. "హియర్ హియర్" అన్నారు. అతడు ఆ విధంగా అనర్గళంగా ప్రసంగించిన తర్వాత మరొక తెల్లటోపీ అందుకున్నాడు: "ఆ చంపబడింది మేక, కోడి ఐతే నష్టపరిహారం పుచ్చుకుని క్షమించవచ్చును. కాని అది సాక్షాత్తు గోమాత. తల్లితో సమానం. అది చనిపోయేముందు ఎలా బాధపడి వుంటుందో. దాని ప్రాణాలు ఎలా కొట్టుకుని వుంటాయో, తన దూడ కోసం అది ఎలా పరితపించి వుంటుందో మీరంతా వూహించండి...." అని రుమాలుతో కళ్లు తుడుచున్నాడు. ప్రేక్షకుల్లో ఇద్దరు ముగ్గురు నిగ్రహించుకోలేక బిగ్గరగా ఏడవ సాగారు. వెనుకనుంచి టోపీధారులు "గోహంతకులు నశించాలి", "అధికార దుర్వినియోగం అంతమొందాలి" అని నినాదాలు చేశారు. ఇంతకీ ఆవు ప్రాణాలు వదిలిందో లేక కొన ఊపిరితో వుందో తెలుసుకునే ఓపిక వాళ్ళకు వుంటేగా!

ఆవు సొంతదారు తరపున పోలీసుల కేసు కూడా నమోదు అయినట్టుంది. ఎస్. పి. తన బృందంతోసహా వచ్చి వాలాడు. అతడికి ఈ వ్యవహారం "ముందు చూస్తే విరాళాలు సేకరించే వాడు, వెనుక చూస్తే కాబులీవాడు"లా వుంది. ఒక వైపు బంగళా యజమాని వి. ఐ. పి. ఐతే, రెండవ వైపు రాజకీయవేత్తలు సమస్యకు రాజకీయపురంగుపులుముతున్నారు. ఈచిక్కులోంచి బైటపడి తన వుద్యోగం కాపాడుకునే వుపాయం ఆలోచించి ఆవు సొంతదారుకు రెండు ఆవుల నష్టపరిహారం ఇప్పిస్తానన్నాడు. కాని రాజకీయవేత్తలు అదేదీ పనికిరాదు. కోర్టు నష్టపరిహారం ఎలాగూ యిప్పిస్తుంది కనుక వి. ఐ. పి. విరుద్ధంగా గోహత్య కేసుమాత్రం నడవవలసిందేనని పట్టుపట్టారు.

వీ. ఐ. పీ. విరుద్ధంగా పోలీసుకేసు నమోదయిందనీ, రాజకీయవేత్తలు గుమికూడారనీ వినగానే హీరోయిన్ విలన్ చేతుల్లో చిక్కుకుందని హీరో ఎలా తెలుసుకుని రేప్‌సీన్ మధ్యలో వూడిపడతాడో అలాగ పత్రికా విలేకర్లు హడావుడిగా వూడిపడ్డారు. మరి ఉత్త కబుర్లు చెప్పి పత్రికా పాఠకులను నమ్మించవచ్చా? చనిపోయిన ఆవు ఫొటో, సిగుతో తల వంచుకున్న వి. ఐ. పి. ఫొటో. ఏడుస్తున్న వి. ఐ. పి. భార్య ఫొటో. అక్కడున్న రాజకీయవేత్తల ఫొటో. ఆవు సొంతదారు ఫొటో, దూడ ఫొటో లాంటివి కూడా వేస్తే పాఠకులకు ఎంత హుషారుగావుంటుంది! అందుకని తోడుగా ప్రెస్ ఫొటోగ్రాఫర్లను కూడా వెంటబెట్టుకుని వచ్చారు పోలీసులు. వాళ్ళను బంగళాలోకి పోనీలేదు కాబట్టి, వాళ్ళు బైటవున్న ఆవు సొంతదారునీ, ఉపన్యాసాలు ఇస్తున్న శాల్తీలనీ ఇంటర్వ్యూ చేసేస్తున్నారు.

ఆ ఆవు తాత ఫలానా పశువుల ప్రదర్శనలో మూడవ బహుమతి పొందాడనీ (రిపోర్టులో మూడవ బహుమతిని ప్రథమ బహుమతిక్రింద మార్చడంవల్ల ఆకాశం వచ్చి వీపుమీద పడిపోదు కాబట్టి విలేకర్లు అలాగే చేశారు) దాని అమ్మమ్మకు అమ్మమ్మపాలు బ్రిటిష్ వైస్రాయ్ తాగేవాడనీ తెలుసుకుని ఈ బోగట్టాలు 'బాక్సు'లో వేయడానికి భేషుగ్గా వుంటాయని మురిసిపోతున్నారు విలేకర్లు.

ప్రెస్ ఫొటోగ్రాఫర్లు బంగళా బైట దృశ్యాలు ఫొటోలు తీశాక ఆవు ఫొటో కూడా ఎలాగో తీయాలనే ఉద్దేశంతో బంగళా ప్రహరీగోడ ఎక్కారు. దీనివల్ల వాళ్ళకు కష్టమే కలిగిందికాని ఆవు మాత్రం కనబడలేదు. ఒకరిద్దరు ప్రహరీగోడ వద్దనున్న కాలువలో పడ్డారు. మరిద్దరు ముళ్ళకంపల్లో చిక్కుకుని చొక్కాలు చింపుకున్నారు. ఐతే వాళ్ళలో సమయస్ఫూర్తిగల ఇద్దరు ఫొటోగ్రాఫర్లు ప్రక్క బంగళా కెళ్ళి, అక్కడి కాంపౌండ్‌లో వున్న చెట్టు ఎక్కి ఆవు. ఇంటి యజమానురాలు ఫొటోలు తీయడంలో కృతార్థులైనారు. వాళ్ళు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, టెన్సింగ్‌నార్కేలా మురిసిపోతున్నారు.

వెటర్నరీ ఇన్‌స్పెక్టర్ బంగళాలోకి పోయి బంగళా యజమానురాలును కలుసుకున్నాడు. ఆమె అతన్ని ఆవు వద్దకు తీసుకెళ్ళగా అతను ఆవును తనిఖీ చేశాడు. తీవ్రంగా వాతం కమ్మడంవల్ల ఆవు పరిస్థితి సీరియస్‌గా వుందని నిర్ధారించుకుని "దీనిని వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్ళి చికిత్స చేయించాలి." అని సలహా ఇచ్చాడు.

"ఎలాగైనా ఆవును బ్రతికించు నాయనా. నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను. ఖర్చు ఎంతైనా సరే ఫర్వాలేదు. దీనిని ఆస్పత్రికి తీసుకెళ్ళే ఏర్పాటు చేయి." అని ఆమె ప్రాధేయపడింది. వెటర్నరీ ఇన్‌స్పెక్టర్ వెంటనే అయ్యగారి కారులో పశువుల ఆస్పత్రికి వెళ్లాడు. దగ్గుతూ వెళితే శొంఠి కూడా ప్రియమైనదన్నట్టు అక్కడి పశువులను తీసుకొచ్చే ట్రక్కు చెడిపోయిందని తెలిసింది. ఆస్పత్రి ముఖ్యాధికారి వ్యవహారం ప్రాముఖ్యత తెలుసుకుని "మిలిటరీ పశు

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విలేపనముతో
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరములేదు!

వుల ఫారంలో ట్రక్కు వుంది నాకు తెలిసిన ఆయన ఒకడు అక్కడ వున్నాడు. ఆయనకు ఫోనుచేస్తాను. మీరు కారులో మా మనుషులను తీసుకెళ్ళి ఆయన్ను ట్రక్కు మాత్రమే అడగండి" అని సలహా యిచ్చాడు. మిలిటరీ ఫారం అక్కడనుంచి పదిమైళ్ళ దూరంలోవుంది. అక్కడికెళ్ళి ట్రక్కును తీసుకొచ్చి బంగళా చేరేసరికి రాత్రి పదకొండు దాటింది.

బంగళావద్ద సందడి తగ్గడానికి బదులు ఎక్కువైంది. బంగళా బైట వృద్ధి చెందిన జన సమూహాన్ని అదుపులో వుంచడానికి పోలీసు బందోబస్తు కూడా హెచ్చింది. పోలీసులు అడ్డుతున్నా కొంతమంది బంగళాలోకి చొరబడి వున్నారు. బైట శనక్కాయలు అమ్మే వాళ్ళు. సిగరెట్లు అమ్మేవాళ్ళు చేరి వ్యాపారం సాగిస్తున్నారు.

పశువుల ట్రక్కును చూసి జనంలో సంచలనం బైలుదేరింది. "ట్రక్కుకు దారీయండి" అని కొంతమంది అరిచారు.

ట్రక్కు బంగళా గేటు ముందు ఆగింది. ఇహ దానిని గేటులోకి జాగ్రత్తగా తీసుకువెళ్ళాలి.

ఇంతలోనే ఆవు సొంతదారు భార్య కూడ బంగళాకు వచ్చింది. వస్తూ ఎందుకైనా మంచిదని ఆమె దూడను కూడా తోడు తీసుకొచ్చింది. దూడ తల్లి పాల కోసం అలమటించి అరుస్తోంది. దూడను చూసి ఆవు దిగునలేచి నిల్చుని. తోక ఝడిపించి దూడను నాకసాగింది. ఆవు యజమానురాలు దూడను నడిపించుకు పోగా వెంబడే ఆవు కూడా ఏమీ జరగనట్టు నడవసాగింది.

ఇంటి యజమాని. యజమానురాలు. ఎస్. పి., ఆవు సొంతదారు ఇష్టదేముళ్ళకు మనసారా నమస్కరించి కృతజ్ఞత చెప్పుకున్నారు. ఈ సంఘటనవల్ల కొంత్త అదనపు డబ్బు చేసుకున్నందుకు వేరు శనక్కాయలు అమ్మేవాళ్ళు. సిగరెట్లు. బీడీలు అమ్మేవాళ్ళు ఆవును ఆశీర్వదించారు. ఇహ నిరాశ చెందినవాళ్ళెవరంటారా— రాజకీయవేత్తలు. పత్రికా విలేకర్లూ. ప్రెస్ ఫొటోగ్రాఫర్లూ. వెటర్నరీ ఇన్‌స్పెక్టర్‌కు మాత్రం ఒక లాభం కలిగింది. అతనికి ఒక వి.ఐ.పీ. కుటుంబంతో పరిచయం అయింది. ❁







